క్లుప్తంగా

కొరిశపాడు తహసీల్దార్‌గా సుబ్బారెడ్డి



మేదరమెట్ల: కొరిశపాడు మండల తహసీల్దార్‌గా జీవీ సుబ్బారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు బదిలీపై వెళ్లగా ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ మెహతాజ్ విధులు నిర్వహించారు.

పంచాయతీల ప్రగతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహ్మద్ అఖీద్ జావెద్

యద్దనపూడి: పంచాయతీల అభివృద్ధికి అధికారులు, పాలకమండలి సభ్యులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీఓ మహ్మద్ అఖీద్ జావేద్ కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్జీఎస్ఏ ప్రణాళికలపై రెండో రోజు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులతో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి పనుల్లో రాజీపడవద్దని, వృథా ఖర్చులు తగ్గించుకొని అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే పంచాయతీలకు సెస్ రూపంలో వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ పీటీవీ కృష్ణ, ఏఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తికి ఆటంకం



వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు



అటలాడేందుకు వీలులేకుండా హైస్కూలు క్రీడా మైదానంలో నిలిచిన వర్షపునీరు

- కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతున్న ఎన్‌ఆర్‌అండ్‌పీఎం క్రీడా మైదానం
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వాకర్ల వినతి

చీరాల రూరల్: అందరికీ ఉపయోగపడే క్రీడా మైదానం కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారిపోతోంది. మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానం వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో ఇక్కడ రోజూ నడిచే వాకర్లు, క్రీడాకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి క్రీడా మైదానంలో సరైన వాకింగ్ ట్రాక్ వేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

100 ఏళ్ల చరిత్ర

చీరాల ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. హైస్కూలు ఏర్పడి 100 ఏళ్లకు పైగా అవుతుండటం విశేషం. అప్పటి నుంచి ఎంతో మంది క్రీడాకారులను తన ఒడిలో చేర్చుకుని క్రీడా బుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దింది. అలానే మరెందరో క్రీడాకారులు ఈ మైదానంలో ప్రతిరోజూ కఠోర శిక్షణ పొంది పోలీసు, ఆర్మీ వంటి వాటిల్లో ఉద్యోగాలుగా స్థిరపడ్డారు.

ఏకైక క్రీడా మైదానం

లక్ష పైగా జనాభా కలిగిన చీరాల పట్టణానికి ఈ క్రీడా మైదాన ఒక్కటే దిక్కు. ప్రతిరోజూ వందల సంఖ్యలో క్రీడాకారులు, వాకర్లు వస్తుంటారు. చీరాల పట్టణానికి చెందిన దాతలు వందేళ్ల క్రితం ఉదార స్వభావంతో ఈ హైస్కూల్‌ను ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్‌కు సంబంధించి సుమారుగా 190 వరకు సభ్యులు ప్రతిరోజూ వాకింగ్ చేస్తుంటారు. వీరుకాక క్రీడాకారులు, విద్యార్థులు ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలు ఆడుతారు. అంతేకాక సాయంత్రం వేళల్లో సరదాగా కాలక్షేపం చేసేందుకు వృద్ధులు కూడా వస్తుంటారు. అయితే వాకింగ్ చేసుకునేందుకు సరైన వాకింగ్ ట్రాక్ లేకపోవడం బాధాకరమైన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా ట్రాక్‌పై వర్షపునీరు నిలిచిపోతోందని తద్వారా వాకింగ్ చేసుకోవడం చాలా ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> **అధికారులు పట్టించుకోవాలి**
>
> కొద్దిపాటి వర్షం పడితే వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలిచిపోతోంది. దీనివలన వాకరులు, క్రీడాకారులు వాకింగ్ చేయడం కష్టంగా ఉంటుంది. ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ క్రీడా మైదానంలో సరైన వాకింగ్ ట్రాక్ లేకపోవడం వలన వాకరులు, క్రీడాకారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి క్రీడా మైదానంలో మంచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి.
>
> – పోలుదాసు రామకృష్ణ, వాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు

పరిశుభ్రత కోసం వాకర్ల సహకారం

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపాలిటీపై అదనపు భారం పడకుండా ఉండేందుకు పరిశుభ్రత కోసం దత్తత తీసుకున్నారు. వాటిని శుభ్రపరిచేందుకు ప్రత్యేకంగా ఒక మనిషిని ఏర్పాటు చేసి ఫినాయిల్, బ్లీచింగ్ వంటివాటిని అందుబాటులో ఉంచి శుభ్రం చేయిస్తున్నారు. ఇప్పటికైనా క్రీడా మైదానంలో చక్కటి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హైరిస్క్ గర్భిణులతో జాగ్రత్త



స్వర్ణలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ షాలిని

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో రక్తహీనతతో ఇబ్బందులు పడే హైరిస్క్‌లో ఉన్న గర్భిణులు ప్రసవ సమయం వరకు వైద్యుల సూచనలతో జాగ్రత్తగా ఉండాలని, వైద్య సిబ్బంది కూడా వారికి అందుబాటులో ఉండాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలిని అన్నారు. బుధవారం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) ద్వారా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 39 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా వేయించాల్సిన టీడీలు, హిమోగ్లోబిన్ శాతం కూడా గుర్తించి అవసరమైన మాత్రలు, ఆరోగ్య సూచనలు అందిస్తారన్నారు. అసరమైన స్కానింగ్ చేసి బిడ్డ ఎదుగుదల విషయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. అందుకు మీరు 108 వాహనాన్ని కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఎంపీహెచ్‌ఈఓ వి. నాగేశ్వరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1987 -88లో 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 36 సంవత్సరాల అనంతరం పాఠశాలలో 1987 88 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో సమావేశమై గత అనుభవాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులైన హనుమంతరావు, జగన్మోహన్రావు, సుబ్బమ్మ, నరసమ్మలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ ఎం. సతీష్ కుమార్ కందిమళ్ల రామకోటేశ్వరరావు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు దాసరి శ్రీనివాసరావు, వెంకట్రావు, మల్లికార్జున, సాంబశివరావు, హరిబాబు, భూలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జీవాల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపూరుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. బుధవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 39 గేదెలకు పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయాలని చెప్పారు. అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

విద్యార్థిని ఢీకొన్న కారు



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థి

బల్లికురవ: సైకిల్ పై వెళుతున్న విద్యార్థిని వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో గాయాల పాలయ్యాడు. ఈ ఘటన బుధవారం మేదరమెట్ల– నార్కెట్ పల్లి నామ్ రహదారిలో కొప్పెరపాడు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పరిటాలకిరణ్, సైకిల్ పై వెళుతుండగా ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు విద్యార్థిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంతమాగులూరు మండలం కొమ్మలపాడు సమీపంలో కారు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

పల్లె పండుగ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూప రాణి

జె.పంగులూరు: ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు జరిగే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె. స్వరూప రాణి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో రూ. 30.30 కోట్లు సిమెంట్ రోడ్డు మంజూరయ్యాయని, వాటితో పాటు 13 పశువుల షెడ్లు కూడా మంజూరయ్యాయన్నారు. వీటికి 14వ తేదీన భూమి పూజలు చేసి పనులు మొదలు పెట్టాలని, పండగ వాతావరణంలా గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సిబ్బందిని కోరారు. మండలంలో నాలుగు లక్షల పదహారు వేల పనిదినాలు ఉపాధి కూలీలకు కల్పించాలని, ఈ పని దినాలను మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేయాలని కోరారు. ఏపీఓ సంతోషమ్మ, ఈఓఆర్‌డీ సుమంత్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి వెండి కడియం వితరణ



అయ్యప్పస్వామికి వెండి కడియం ఇస్తున్న దాతలు

చినగంజాం: సోపిరాల గ్రామంలో హరిహర సుత అయ్యప్ప స్వామి మందిరంలో వేంచేసియున్న అయ్యప్ప స్వామికి దాతలు వెండి కడియం బహూకరించారు. గుంటూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోలకం పవన్ సాయి సుమారు రూ. 25 వేలు విలువ కలిగిన వెండి కడియం సమకూర్చగా అతని తల్లిదండ్రులు పోలకం శరభారావు, విజయలక్ష్మి వాటిని బుధవారం ఆలయ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులుకు అందజేశారు.

ఆశ్రమ నిర్మాణానికి రూ. 25 వేల విరాళం

మార్టూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న అమ్మ అనాథ ఆశ్రమ నిర్మాణానికి బుధవారం దాతలు 25 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి దంతనాల కనక రత్నాచారి పద్మావతి దంపతులు తమ కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందుకు అందజేసిన అనంతరం అన్నదానం నిర్వహించారు. సుబ్రహ్మణ సంఘ నాయకులు మచ్చ శేషాచారి, కె.వినయ్, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

బల్లికురవ: భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చీరాల ఆర్డీఓ డి. అఖిల కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 11 అర్జీలను స్వీకరించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఇన్‌చార్జి తహల్దార్ రవి కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

మార్టూరు: జాతీయ రహదారిపై గతవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఆయన అసిస్టెంట్ తీవ్రంగా గాయపడిన విషయమై బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పెండ్యాల రామకృష్ణ సెక్యూరిటీ గార్డ్ రమేష్ తో కలిసి ఈనెల 5వ తేదీ బైకుపై వెళుతుండగా మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో చికిత్స పొందుతున్న రామకృష్ణ ఎడమ కాలు తొలగించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. చీరాల విజయనగరకాలనీ సమీపంలో దిగువ లైనుపై వెళుతున్న వందే భారత్ రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. వివరాలు తెలిసినవారు 9440627646 నంబర్‌కు తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

విత్తన శుద్ధితో మంచి దిగుబడి



కుర్రవానిపాలెంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు



తూర్పుకొప్పెరపాడులో..



దగ్గుబాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

దగ్గుబాడు (కారంచేడు): మిరప, పొగాకు సాగు చేసే అన్నదాతలు మెళకువలు పాటించాలని ఏఓ సుధీర్ బాబు సూచించారు. బుధవారం దగ్గుబాడు, స్వర్ణపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతన్నలకు అవగాహన కల్పించారు. పంట వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు.

బల్లికురవ: మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో కుమారి అన్నారు. మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు.

మేదరమెట్ల: ప్రతి రైతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకొని వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చు, అధిక దిగుబడులు వస్తాయని కొరిశపాడు మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కుర్రవానిపాలెం, రావినూతల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. డ్రోన్‌తో వ్యవసాయం చేయడం వలన కలిగే ప్రయోజనాలను ఏవో రైతులకు వివరించారు. పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశుపోషణ గురించి వివరించారు. గేదెలకు పడ్డ దూడలు పుట్టే విధంగా తగిన ఇంజక్షన్ చేయించుకోవాలని గేదెల రుణాలను పొందడం ఎలాగో రైతులకు వివరించారు. ఏఎంసీ సూపర్‌వైజర్ రామాంజనేయులు, వీఏఏ రాజేష్, రాణి, మౌనిక పాల్గొన్నారు.


జె.పంగులూరు: రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేలా చూడాలని మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పంట సాగు చేసే ముందు ప్రతి రైతు తప్పకుండా విత్తనం శుద్ధి చేయాలన్నారు. పురుగు మందులు ఎక్కువగా వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయాలన్నారు. పంటలకు సేంద్రియ ఎరువులు వాడటం వలన పెట్టుబడి తగ్గి రైతుకు మంచి దిగుబడి వచ్చి ఆదాయం వస్తుందన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది ఫిలిప్స్, సర్పంచ్‌లు ఎనికపాటి కళ్యాణి, పచ్చ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినగంజాం: రైతులు వరిసాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చు అని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం మండలంలోని పెదగంజాం, నీలాయపాలెం గ్రామాల్లో నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అద్దంకి: పొగాకు సాగు తగ్గించి అపరాలు పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధనరాజ్ సూచించారు. దేనువకొండ మరియు గోపాలపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. పొగాకు బదులు ఆరుతడి పంటలైన శనగ, మొక్కజొన్న, మినుము, జొన్న పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉద్యాన అధికారి ఎస్. దీప్తి మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీ పై అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, దేనువకొండ గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మ, వ్యవసాయ సహాయకులు శేషయ్య, వీరేష్ ,రాఘవయ్య, నరసింహారావు, యర్రా చలపతి రావు పాల్గొన్నారు.

మార్టూరు: వరిని ఎద పద్ధతిలో సాగు చేస్తే సాధించవచ్చు అని సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం భాగంగా బొల్లాపల్లి తాటివారిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ వరి పైర్‌ను నారు పోసి పెంచి తర్వాత నాట్లు వేయడంతో పోల్చుకుంటే ఎద పద్ధతిలో సాగు చేయటం వల్ల రైతులకు ఎనిమిదివేల రూపాయల సాగు ఖర్చు ఆదా అవుతోందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి హనుమంతనాయక్ మామిడి మిరప పైర్లలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. పశుసంవర్ధక అధికారి మాధవి, లత బొల్లాపల్లి గ్రామ సర్పంచ్ సింగరావు, రైతు సంఘం నాయకులు కృష్ణమూర్తి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో కుమారి అన్నారు. మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఫలితాలు, నేలను బట్టి ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పశువుల కోసం షెడ్లు నిర్మించుకొంటే సబ్సిడీ ఉందని తెలిపారు. మార్కెటింగ్ సిబ్బంది సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.




అద్దంకి: మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్



పెదగంజాంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భాస్కరరావు



బొల్లాపల్లిలో సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు



చెన్నుపల్లిలో మాట్లాడుతున్న ఏఓ కుమారి

ప్లాస్టిక్ కవర్లు విడనాడాలి

చీరాల: పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ కవర్లను విడనాడాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ అన్నారు. నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి సహకారంతో తయారు చేసిన చేతి సంచులను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆవిష్కరించారు. చుండూరి కృష్ణమూర్తి, కనపర్తి రామారావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై అవగాహన



ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణ

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. పంచాయతీల పరిధిలోని ప్రజా ప్రజా ప్రతినిధులుకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలి

చీరాల అర్బన్: పట్టణంలో పబ్లిక్ టాయ్‌లెట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. బుధవారం చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైల్వేస్టేషన్, గరల్స్ హైస్కూల్ రోడ్డులో టాయిలెట్లు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేక పనికిరాకుండా పోయాయన్నారు. అల్తాఫ్, బుజ్జి, గబ్బార్, ఇబ్రహీం, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సరస్వతీ నమో స్తుతే!



కారంచేడులో సరస్వతీదేవిగా..



వేటపాలెంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

చీరాల అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులు అందించిన విరాళాలతో చేయించిన బంగారు శంకు, చక్రాలను స్వామివారికి శాస్త్రోక్తంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలను ఎస్.పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించారు. దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొని హోమ క్రతువును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని స్వయంభుగా వెలసిన శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో దసరా పర్వదినం పురస్కరించుకొని దేవి నవరాత్రుల ఉత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. బుధవారం సరస్వతీదేవిగా భావించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీళ వెంకటసుబ్బారావు చేతుల మీదగా పుస్తకాలు పంపిణీ చేయించారు.

యద్దనపూడి: శరన్నవరాత్రుల్లో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం ఏడో రోజున అమ్మవారు బ్రహ్మచైతన్య స్వరూపిణి అయిన సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంగీత, సాహిత్యాలకు అధిష్టానదేవత సరస్వతిదేవి శ్వేతపద్మాన్ని అధిష్టించి వీణ, దండ, అభయముద్రలతో భక్తులకు దర్శనమిచ్చారు.

కారంచేడు: దేవీ సరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగుతున్నాయి. కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామం కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి బుధవారం పూజలు నిర్వహించారు. అలాగే మేదరమెట్ల మిద్దెల డొంకరోడ్డులో గల కనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి.

వేటపాలెం: పలు దేవస్థానాల్లో దసరా నవరాత్రోత్సవాలు ఏడో రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక కన్యకాపర మేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని చదువుల తల్లి సరస్వతా దేవిగా అలంకరించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల రాజ్యలక్ష్మీ పద్మవతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్చూరు (చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారిని శ్రీ సరస్వతీదేవి అవతారంలో అలంకరించారు. అమ్మవారి పుట్టిన మూలా నక్షత్రం కావడంతో ఈ రోజుకు ప్రత్యేకత సంతరించుకుంది. వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతులు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం నృత్యశ్రీ అకాడమీ వారిచే భరతనాట్యం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నూతలపాడు ఉత్సవ సమితి ఆదిపూడి మోహన్‌కృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగగుంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చినగంజాంలో..


మండలంలోని సోపిరాల గ్రామంలోని శ్రీ లలితారామకోటేశ్వర ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవి అవతారంలో అలంకరించారు. ఉభయ దాతలుగా టీఎస్సార్ ఆంజనేయులు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పూజారి శంకరమంచి హనుమంతరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చినగంజాంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి మందిరంలో, స్టేషన్ సెంటర్‌లోని విజయకనకదుర్గభవానీ మందిరంలో అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.




కారంచేడు వైష్ణవీ దుర్గా మాత ఆలయంలో..



మేదరమెట్లలో సరస్వతీ దేవిగా..



సరస్వతిదేవిగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారు



నూతలపాడులో అమ్మవారు



చినగంజాంలో సరస్వతీ దేవిగా..



జె. పంగులూరు: సరస్వతీ దేవిగా..



జె. పంగులూరు: పుస్తకాలు, పెన్నులు అందజేత



కారంచేడు: కార్యక్రమంలో చిన్నారులు



రావినూతలలో సరస్వతీదేవిగా



చీరాల: సువర్ణ శంకు, చక్రాలు



సువర్ణ కిరీట అలంకరణలో..